సీఎం జగన్‌ను కలిసిన జాన్‌వెస్లీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సత్కరిస్తున్న బొల్లవరపు జాన్‌వెస్లీ

సీతంపేట: మైనారిటీ వెల్ఫేర్ డే, నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ సీఎం జగన్ తనపై నమ్మకం ఉంచి రెండో సారి తనను చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రెండేళ్లలో క్రైస్తవుల అభ్యున్నతికి మరింత మెరుగ్గా సేవలు అందిస్తానన్నారు.

దీపావళి కానుకల పంపిణీ



దీపావళి కానుకలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆర్పీలు, వలంటీర్లకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దీపావళి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తాను పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. దీపావళి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సుమారు 450 మందికి దీపావళి మందుగుండు సామగ్రి, స్వీట్లు పంపిణీ చేశారు. కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, కె.చిన్నా, సీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా రాంభట్ల



సీతంపేట: ఈ నెల 10 నుంచి ప్రారంభమైన తిరుచానూరు పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా విశాఖకు చెందిన కవి, వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మకు అవకాశం దక్కింది. 15వ తేదీ సాయంత్రం 4 నుంచి 5.30 వరకు స్వర్ణ రథం, రాత్రి 7 నుంచి 9 వరకు గరుడ వాహనం, 16న ఉదయం 8 నుంచి 10 వరకు సూర్యప్రభ వాహనోత్సవాలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేయనున్నారు. శ్రీవెంకటేశ్వరస్వామి భక్తి చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే ఈ బ్రహ్మోత్సవాలకు ఇలాంటి అవకాశం రావడం ఇది పన్నెండో సారని రాంభట్ల తెలిపారు.

కిటకిటలాడిన రైతుబజార్

సీతమ్మధార: దీపావళి పండగ సందర్భంగా సీతమ్మధార రైతుబజార్ శనివారం వినియోగదారులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో జనం పూజా సామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు.



అన్నసమారాధనకు కె.కె.రాజు విరాళం



స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్టు ఆధ్వర్యంలో పోర్టు ఆస్పత్రి కూడలి సమీపంలో అయ్యప్ప దీక్షా స్వాములకు నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు రెండు రోజులు అన్నదానానికి అవసరమైన మొత్తాన్ని విరాళంగా అందజేశారు. శనివారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన పాల్గొని స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రతి ఏటా మండల కాలం పాటు నిర్వహించడం గొప్ప విషయమని ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమ నిర్వహణకు ఆర్థికంగానే కాకుండా నిర్వహణ పరంగా కూడా కె.కె.రాజు అన్ని విధాల సహకరించారని ట్రస్టు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

దేవిశ్రీ సామాజిక గేయాల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

సీతంపేట: ప్రజా గాయకుడు, కవి మజ్జి దేవిశ్రీ రచించిన సామాజిక గేయాల పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తరాంధ్ర జానపదాన్ని, వ్యవహారిక భాష ఔన్నత్యాన్ని ప్రజా బాహుళ్యానికి వంగపండుతో కలిసి తదుపరి కూడా కొనసాగిస్తున్న దేవిశ్రీని ఉత్తరాంధ్ర గద్దర్‌గా అభివర్ణించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ సామాజిక సమస్యలు, పర్యావరణ పరిరక్షణపై దేవిశ్రీ పాడిన పాటలు తెలుగు భాష ఉన్నంత కాలం ప్రజాబాహుళ్యంలో ఉంటాయన్నారు. సభాధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యాస, భాష దేవిశ్రీ పాటల్లో తొణికిసలాడుతాయన్నారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని సమీక్షించారు. అతిథుల చేతుల మీదుగా దేవిశ్రీని, ఆయన తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మారెడ్డి శివశంకర్, పర్యావరణ కళామండలి ప్రధాన కార్యదర్శి రౌతు గోపి, న్యాయవాది వజ్జపర్తి శ్రీనువాసు, జర్నలిస్టు యూనియన్ నాయకుడు గంట్ల శ్రీనుబాబు, జనసేన నాయకులు పంచకర్ల సందీప్, ఆచార్య అయ్యగారి సీతారత్నం, ప్రొఫెసర్ సూరప్పుడు, వెంకటపతిరాజు, ఆడారి కిషోర్‌కుమార్, పలువురు సాహితీ ప్రియులు, అభిమానులు పాల్గొన్నారు.

వెంగళరావు కుటుంబానికి కార్మికుల పరామర్శ



కొల్లాబత్తుల రమణమ్మ, ప్రసన్నలను పరామర్శిస్తున్న పారిశుధ్య కార్మికులు

కంచరపాలెం: ఇటీవల మృతి చెందిన మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దళిత నాయకుడు కొల్లాబత్తుల వెంగళరావు కుటుంబ సభ్యులు భార్య రమణమ్మ, కుమార్తె ప్రసన్నలను 54వ వార్డు 104 ఏరియాలోని స్వగృహంలో శనివారం 47, 48 వార్డులకు చెందిన పారిశుధ్య కార్మికులు పరామర్శించారు. వెంగళరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు సవరపు జయకుమార్ మాట్లాడుతూ వెంగళరావు పెట్టిన భిక్షతో నేడు సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిక్కోలు అప్పారావు, పోతల రాజు, యల్లబిల్లి నూకరాజు, నాగరాజు, బాబురావు, చండీ, అప్పలకొండ, అనసూయ, మణి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పట్టివేత

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా సామగ్రి విక్రయిస్తున్న దుకాణాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. అక్కయ్యపాలెం, నరసింహనగర్, మహారాణి పార్లర్, సత్యసాయినగర్, రైల్వే న్యూకాలనీ ప్రాంతాల్లో దాడులు చేసి సుమారు లక్ష రూపాయలకు పైగా విలువైన బాణసంచాను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అందరి ఆరోగ్యమే వాకర్స్ ధ్యేయం

మురళీనగర్: సమాజంలోని అందరికీ ఆరోగ్యంపై చైతన్యం కలిగించడమే ధ్యేయంగా వాకర్స్ క్లబ్ సభ్యులు పనిచేయాలని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆయన ఆధ్వర్యంలో శనివారం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

విద్యతోనే సామాజిక పరివర్తన

మురళీనగర్: విద్యతోనే సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని ప్రవచించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయుడని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం కాలేజీలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక బాధ్యతతో మెలగాలన్నారు. ముందుగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కెమికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, అధ్యాపకులు కుమార్, కుమారి, జ్యోతి, ఇన్‌చార్జి ఓఎస్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

లలితా పీఠంలో తిరుమంజన సేవ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శనివారం త్రయోదశి సందర్భంగా భూసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, భక్తులు పూజలు నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, శోడశోపచార పూజ, పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.